

ఆలూరు మార్గం.. ఆగమాగం

ఆలూరు గేటు నుంచి తంగడపల్లి రోడ్డు మీద ప్రయాణం కత్తి మీద సాములా మారింది. 8లో▸



అమ్మకు బోనం..

వికారాబాద్ పరిధిలోని మద్గుల్ చిట్టంపల్లి, రామయ్యగూడ, ఎన్నెపల్లిలో బోనాల పండుగను ఘనంగా నిర్వహించారు. 8లో▸



నిర్వహణ లేక..

రెండు దశాబ్దాల క్రితం మండలంలో నిర్మించిన వీఎస్ఎస్ బస్ షెల్టర్లు నిరుపయోగంగా మారాయి. 9లో▸

న్యూస్‌రీల్

ఘనంగా బోనాల జాతర



అమ్మవారికి పట్టు వస్త్రాలు తెస్తున్న ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి

తాండూరు టౌన్: ఆషాఢమాసం సందర్భంగా తాండూరు పట్టణంలో వెలసిన శ్రీ కాళికాదేవికి సోమవారం ఘనంగా బోనాల జాతర నిర్వహించారు. ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించి పూజలో పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. అమ్మవారి కరుణా కటాక్షాలు నియోజకవర్గ ప్రజలందరిపై ఉండాలని కోరుకున్నట్లు చెప్పారు. ఎమ్మెల్యేతో పాటు ఆలయ కమిటీ అధ్యక్షుడు బస్వరాజ్, ఈఓ నరేందర్ తదితరులు ఉన్నారు.

రేపు విద్యాసంస్థల బంద్

అనంతగిరి: వామపక్ష విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో బుధవారం ప్రభుత్వ పాఠశాలలు, జూనియర్ కళాశాలల బంద్ నిర్వహించనున్నట్లు ఆ సంఘాల నాయకులు సోమవారం తెలిపారు. సర్కారు బడులు, జూనియర్ కళాశాలల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని, ప్రైవేట్ విద్యాసంస్థల్లో ఫీజుల దోపిడీని అరికట్టాలని నాయకులు డిమాండ్ చేశారు. ఈ సమస్యల పరిష్కారం కోసం తలపెట్టిన బంద్‌కు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు రాజేష్, శ్రీకాంత్, శేఖర్, సంగమేశ్వర్ పాల్గొన్నారు.

గెలుపే లక్ష్యంగా పని చేద్దాం



మాట్లాడుతున్న ఎమ్మెల్యేలు టీఆర్ఆర్, కాలె

నవాబుపేట: రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు పని చేయాలని పార్టీ జిల్లా అధ్యక్షుడు, పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి, చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య సూచించారు. సోమవారం నవాబుపేటలో పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మండలం అధ్యక్షుడిగా మేడిపల్లి వెంకటయ్యను మరోసారి ఎన్నుకున్నారు. అనంతరం వారు మాట్లాడుతూ.. పార్టీ అభివృద్ధి కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల విజయమే లక్ష్యంగా సాగాలని పిలుపునిచ్చారు. ఈ బాధ్యత మనందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ యాదవరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ రాంరెడ్డి, నాయకులు చిట్టెపు మల్లారెడ్డి, నాగిరెడ్డి, వెంకట్‌రెడ్డి, ఎక్ బాల్, సామ వెంకట్ రెడ్డి, ప్రభాకర్ రెడ్డి, సంజీవ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

నేడు షాద్‌నగర్‌కు మంత్రి శ్రీధర్‌బాబు రాక

షాద్‌నగర్: మహిళా శక్తి కార్యక్రమంలో భాగంగా మహిళా సంఘాలకు వడ్డీలేని రుణాలు పంపిణీ చేసేందుకు మంత్రి శ్రీధర్ బాబు మంగళవారం షాద్‌నగర్‌కు విచ్చేస్తున్నట్లు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నియోజకవర్గంలోని 3,418 మహిళా సంఘాలకు రూ.3.29 కోట్ల చెక్కులను మంత్రి చేతుల మీదుగా అందజేయనున్నట్లు తెలిపారు. పట్టణంలోని రెడ్‌రోడ్ ఫంక్షన్ హాల్‌లో మధ్యాహ్నం 2గంటలకు నిర్వహించే కార్యక్రమానికి మహిళా సంఘాల సభ్యులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

ఆర్టీసీలో అప్రెంటీస్‌కు దరఖాస్తుల ఆహ్వానం

షాద్‌నగర్‌రూరల్: ఆర్టీసీ మహబూబ్‌నగర్ రీజియన్ పరిధిలోని వివిధ డిపోల్లో ఇంజనీరింగ్, నాన్ ఇంజనీరింగ్ గ్రాడ్యుయేషన్ విభాగాల్లో మూడేళ్ల అప్రెంటిస్ శిక్షణకోసం దరఖాస్తు చేసుకోవాలని రీజినల్ మేనేజర్ సంతోష్‌కుమార్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గ్రాడ్యుయేషన్/ఇంజనీరింగ్, ఐటీ/కంప్యూటర్ సైన్స్/ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్/గణితం విద్యలో ఇంజనీరింగ్, డిప్లొమా, నాన్‌ఇంజనీరింగ్ గ్రాడ్యుయేషన్ విద్యార్హతలు కలిగి ఉండి 2021లో ఉత్తీర్ణులై ఉండాలని తెలిపారు. దరఖాస్తులను నేషనల్ అప్రెంటిస్ ట్రెనింగ్ స్కీం(ఎన్ఎటీఎస్) కింద వెబ్ పోర్టల్‌లో ఈ నెల 27 వరకు రిజిస్టర్ చేసుకొని మహబూబ్‌నగర్ రీజియన్‌కు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఇంజనీరింగ్, డిప్లొమా, నాన్ ఇంజనీరింగ్ గ్రాడ్యుయేషన్‌లో మెరిట్ ప్రాతిపదికన ఎంపిక ఉంటుందన్నారు. శిక్షణ కాలంలో అభ్యర్థులకు స్టైఫండ్ ఇవ్వడం జరుగుతుందని తెలిపారు.

లైన్ క్లియర్

వికారాబాద్ – కృష్ణా రైల్వే లైన్‌కు మోక్షం



- ఫైనల్ సర్వే పూర్తి
- కొడంగల్ మీదుగా మార్గం
- అంచనా వ్యయం రూ. 2వేల కోట్లు
- రైలు మార్గం పొడవు 122 కిలోమీటర్లు

తుది మార్గం: వికారాబాద్ – పరిగి – కొడంగల్ – దౌల్తాబాద్ – బాలంపేట – దామరగిద్ద – నారాయణపేట – మక్తల్ – కృష్ణా

కొడంగల్‌కు రెండు కిలోమీటర్ల దూరంలో తాండూరు రోడ్డు సమీపంలో కొడంగల్ రైల్వే స్టేషన్ ?



కొడంగల్‌లో సర్వే చేస్తున్న ఉద్యోగి (ఇన్‌సెట్‌లో) తాండూరు రైల్వే స్టేషన్

కొడంగల్: వికారాబాద్ – కృష్ణా రైల్వే లైన్‌కు ఎట్టకేలకు మోక్షం లభించింది. సర్వే పనులు పూర్తయ్యాయి. వికారాబాద్, పరిగి, కొడంగల్ మీదుగా కృష్ణా వరకు నూతనంగా రైలు మార్గం ఏర్పాటు కానుంది. భవిష్యత్తులో ఈ మార్గాన్ని కర్ణాటక రాష్ట్రం రాయిచూర్ వరకు పొడిగించే అవకాశం ఉందని అధికారిక వర్గాల సమాచారం. వికారాబాద్ జంక్షన్ నుంచి నారాయణపేట జిల్లా కృష్ణా వరకు సుమారు రూ.2 వేల కోట్ల వ్యయంతో 122 కిలోమీటర్ల దూరం రైలు మార్గం వేయనున్నారు. భూసేకరణ, సాంకేతిక, ఆర్థిక అంశాలపై అధికారులు సమగ్ర ప్రాజెక్టు రిపోర్టును తయారు చేస్తున్నారు. నెల రోజుల్లో డీపీఆర్‌ను రైల్వే బోర్డుకు చేరే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. కొడంగల్ నుంచి 2009, 2014లో ఎమ్మెల్యేగా గెలిచిన రేవంత్‌రెడ్డి ఎన్నో ఏళ్లుగా ఈ ప్రాజెక్టు కోసం కృషి చేశారు. చివరకు ఆయన ముఖ్యమంత్రి అయిన తర్వాత కొడంగల్ మీదుగా కొత్త రైల్వే లైన్‌కు మార్గం సుగమం అయ్యింది. ఈ ప్రాజెక్టు వ్యయాన్ని కేంద్ర ప్రభుత్వమే భరించాలని సీఎం లేఖ రాసినట్లు తెలిసింది. తుది సర్వేలో రూట్ మ్యాప్‌ను సిద్ధం చేసినట్లు సమాచారం. ఏఏ ప్రాంతాల మీదుగా రైలు మార్గం నిర్మించాలి.. రైల్వే స్టేషన్లు ఎక్కడెక్కడ ఉండాలి.. ఎంత భూమి అవసరం.. వంతెనలు ఎక్కడ అవసరం.. అటవీ, పట్టా, ప్రభుత్వ భూములు.. పర్యావరణం తదితర అంశాలపై సమగ్ర నివేదికను సిద్ధం చేసినట్లు అధికారిక వర్గాల ద్వారా తెలిసింది. మొదటి, రెండు దశల్లో చేసిన సర్వేకు కొద్దిగా మార్పులు చేసి కొడంగల్ పట్టణ శివారులో తాండూరు రోడ్డుకు సమీపంలో కొడంగల్ రైల్వే స్టేషన్‌కు రూపకల్పన చేసినట్లు తెలిసింది. ఎట్టకేలకు ఈ ప్రాంత ప్రజల చిరకాల కోరిక నెరవేరే అవకాశం లభించింది. ఈ రైల్వే లైన్ అందుబాటులోకి వస్తే జిల్లాలోని వికారాబాద్, పరిగి, కొడంగల్ నియోజకవర్గ ప్రజలకు ఎంతో మేలు జరగనుంది. నాలుగు దశాబ్దాలుగా నానుతూ వస్తున్న ఈ పనులకు ఎట్టకేలకు మోక్షం లభించింది. గతంలో ఈ ప్రాజెక్టుకు రాష్ట్ర వాటాగా ఇవ్వాల్సిన నిధులను ఇవ్వలేదు. దీంతో ఇన్నాళ్లు పెండింగ్‌లో పడింది. ఇటీవల సీఎం రైల్వే శాఖ ఉన్నతాధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించి పనులను వేగిరం చేయాలని కోరారు. దీంతో సర్వే పనులు తుది దశకు వచ్చాయి. వికారాబాద్ నుంచి పరిగి, కొడంగల్, నారాయణపేట, మక్తల్ నియోజకవర్గాల మీదుగా రాయిచూర్‌కు మార్గం వేయాలని రైల్వే శాఖ అధికారులు భావిస్తున్నారు.

46 ఏళ్లుగా నిరీక్షణ

కొడంగల్ మీదుగా రైల్వే లైన్ కోసం 1980 – 81 సంవత్సరంలో అప్పటి మహబూబ్‌నగర్ ఎంపీ, రైల్వేశాఖ సహాయ మంత్రి మల్లికార్జున్ సర్వేకు ఆదేశించారు. వికారాబాద్ నుంచి పరిగి, దోమ, సర్దార్‌ఖాన్‌పేట, మద్దూరు, నారాయణపేట, ఊట్కూర్, మక్తల్, మాగనూర్ మీదుగా కృష్ణ వరకు రైల్వేలైన్ నిర్మాణానికి సర్వే కూడా చేశారు. కొడంగల్, బొంరాస్‌పేట, దౌల్తాబాద్ మీదుగా లైన్ వేస్తే ఆదాయం వస్తుందని గణాంకాలను విశ్లేషిస్తూ ఆయా ప్రాంతాల ప్రజలు కేంద్రానికి నివేదిక పంపించారు. దీంతో కేంద్రం రెండోసారి సర్వే చేయించింది. కొడంగల్ మీదుగా రైల్వే లైన్ వేస్తే బాగుంటుందని నిపుణులు నివేదిక సమర్పించారు. అనంతరం జరిగిన పరిణామాల వల్ల రాష్ట్ర విభజన జరిగింది. ఆతర్వాత జిల్లాల విభజన చేశారు. కోస్గి, మద్దూరు మండలాలు నారాయణపేట జిల్లాలోకి వెళ్లాయి. కొడంగల్, బొంరాస్‌పేట, దౌల్తాబాద్ మండలాలు వికారాబాద్ జిల్లా పరిధిలోకి వచ్చాయి. ఈ నేపథ్యంలో కొడంగల్ మీదుగా రైల్వే లైన్ వేస్తే జిల్లా కేంద్రానికి రాకపోకలు సాగించడానికి వీలుగా ఉంటుందని స్థానికులు పలు మార్లు కేంద్ర మంత్రులకు, ఎంపీలకు, అధికారులకు వినతి పత్రాలు సమర్పించారు.

అప్రమత్తంగా ఉండండి

మరో మూడు రోజులపాటు వర్షాలు

- ఆస్తి, ప్రాణ నష్టం జరగకుండా చూసుకోవాలి
- కలెక్టర్ ప్రతీక్‌జైన్

అనంతగిరి: జిల్లాలో ఎడతెరపి లేని వర్షాలు కురుస్తున్నందున అధికారులు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ ప్రతీక్‌జైన్ సోమవారం ఒక ప్రకటనలో ఆదేశించారు. తహసీల్దార్లు, మండల అభివృద్ధి అధికారులు, మున్సిపల్ కమిషనర్లు ముందస్తు చర్యలు తీసుకొని ఆస్తి, ప్రాణ నష్టం జరగకుండా చూసుకోవాలన్నారు. ప్రజలు కూడా జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ఉరుములు, మెరుపులు వస్తున్నప్పుడు ప్రజలు చెట్లు, విద్యుత్ స్తంభాలు, భవనాల వద్ద నిలబడరాదని తెలిపారు. గ్రామాల్లో, మున్సిపాలిటీల్లో పాతబడిన, శిథిలావస్థకు చేరిన ఇళ్లను గుర్తించి వాటిలో నివాసం ఉంటున్న వారిని ఖాళీ చేయించి సురక్షిత ప్రాంతాలకు తరలించాలని సూచించారు. మురుగు కాలువల్లో చెత్తాచెదారం ఉంటే వర్షపు నీరు ముందుకు పోదని, వెంటనే వాటిని శుభ్రం చేయించాలన్నారు. లోతట్టు ప్రాంతాల్లో వరద నీరు నిలవకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈగలు, దోమలు వ్యాప్తి చెందితే అంటురోగాలు ప్రబలే ప్రమాదం ఉంటుంది, పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. ఎక్కడైనా పంటలకు నష్టం జరిగితే వెంటనే నివేదిక పంపాలని వ్యవసాయ శాఖ అధికారులకు సూచించారు. విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగకుండా చూసుకోవాలన్నారు. పాతబడిన, దెబ్బతిన్న విద్యుత్ స్తంభాలు ఉంటే వెంటనే వాటని మార్చాలని, వేలాడుతున్న వైర్లను సరి చేయాలని తెలిపారు. ఎక్కడైనా సమస్యలు ఎదురైతే వెంటనే ఉన్నతాధికారులకు సమాచారం ఇవ్వాలన్నారు. అంతకుముందు నగరం నుంచి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్, అధికారులు పాల్గొన్నారు. వర్షాల నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని సీఎం కలెక్టర్లకు సూచించారు. అనంతరం కలెక్టర్ జిల్లా అధికారులతో సమావేశమయ్యారు. అన్ని విభాగాలను అప్రమత్తం చేయాలని ఆదేశించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా చూడాలన్నారు. జిల్లాలోని ఎరువుల దుకాణాలను సందర్శించి ఎంత మేర యూరియా ఉందో పరిశీలించాలని ఆదేశించారు. యూరియా కొరత లేకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు లింగ్యా నాయక్, సుధీర్, అసిస్టెంట్ కలెక్టర్ హర్ష్ చౌదరి, సబ్ కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ ప్రతీక్‌జైన్, ఇతర అధికారులు



ధారూరు పీఏసీఎస్ వద్ద యూరియా కోసం క్యూ కట్టిన రైతులు

యూరియా పాట్లు

- ధారూరు పీఏసీఎస్ వద్ద క్యూ కట్టిన రైతులు
- కేవలం 50 బస్తాలే రావడంతో ఆగ్రహం
- సాగుకు సరిపడా పంపిణీ చేయాలని డిమాండ్

ధారూరు: ధారూరు పీఏసీఎస్ వద్ద యూరియ కోసం సోమవారం రైతులు క్యూ కట్టారు. మొక్కజొన్న, పత్తి, వరినాట్లకు యూరియ అవసరం కావడంతో భారీగా తరలివచ్చారు. దీంతో తోపులాట, స్వల్ప ఘర్షణలు చోటుచేసుకున్నాయి. యూరియా కొరత కారణంగా ఇబ్బంది పడుతున్నామని అన్నదాతలు తెలిపారు. వారం రోజుల నుంచి యూరియా సరఫరా కావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం కేవలం 50 బస్తాలే వచ్చాయి. ఒక్కో రైతుకు రెండు బస్తాల చొప్పున పంపిణీ చేశారు. ధారూరు పీఏసీఎస్ పరిధిలో 40 గ్రామాల ఉంటే కొన్ని బస్తాల యూనియానే పంపడం ఏమిటని పలువురు ప్రశ్నించారు. రెండు గ్రామాలు ఉన్న హరిదాస్‌పల్లి పీఏసీఎస్ పరిధిలోని రైతులకు 3 నుంచి 4 బస్తాలు పంపిణీ చేస్తున్నారని తెలిపారు. ప్రస్తుతం మొక్కజొన్న, పత్తి, వరికి యూరియా వేయాల్సి ఉన్నా సరిపడా సరఫరా కావడం లేదన్నారు. సాగుకు సరిపడా యూరియా సరఫరా చేయాలని అన్నదాతలు డిమాండ్ చేశారు. లేకుంటే పంటలు దెబ్బతినే అవకాశం ఉందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పేదల సంక్షేమానికి కృషి



వాల్యనాయక్ తండాలో సీసీ రోడ్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి తదితరులు

ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

కుల్కచర్ల: పేదల సంక్షేమమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకు సాగుతోందని పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి అన్నారు. సోమవారం చౌడాపూర్ మండలం వాల్యానాయక్ తండా జీపీ, అడవి వెంకటాపూర్ జీపీ, చౌడాపూర్, మందిపల్, ముక్తవెంకటాపూర్, పుర్సంపల్లి, మరికల్ గ్రామాల్లో వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, పూర్తయిన వాటికి ప్రారంభోత్సవాలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రతి గ్రామాన్నీ అభివృద్ధి పథంలో తీసుకెళ్లడమే లక్ష్యంగా నిధులు మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. రోడ్లు, తాగు నీరు, వీధి దీపాలు, మురుగు కాల్వల నిర్మాణానికి ప్రాధాన్యత ఇస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో పార్టీ చౌడాపూర్ మండల అధ్యక్షుడు అశోక్‌కుమార్, పీఏసీఎస్ వైస్ చైర్మన్ నాగరాజు, ఏఎంసీ వైస్ చైర్మన్ రామ్మోహన్ శర్మ, బ్లాక్ బీ అధ్యక్షుడు భరత్‌కుమార్, వర్కింగ్ ప్రెసిడెంట్ వెంకటయ్య, సలీం, ఉపాధ్యక్షుడు నరసింహ నాయక్, యువజన విభాగం అధ్యక్షుడు రాము తదితరులు పాల్గొన్నారు.

అంతులేని నిర్లక్ష్యం

- ఐదేళ్లు కావస్తున్నా పూర్తికాని రోడ్ల నిర్మాణం
- 2020 – 21లో జిల్లాకు 13 మంజూరు
- విడుదలైన నిధులు రూ.56.85 కోట్లు
- నిర్మించాల్సిన దూరం 93.9 కిలోమీటర్లు
- ఇంకా పూర్తి కానివి ఐదు
- రోజురోజుకూ పెరిగిపోతున్న అంచనా వ్యయం
- తీవ్ర ఇబ్బందుల్లో ప్రయాణికులు



అధ్వానంగా చించల్‌పేట్ గేట్ – చించల్‌పేట్ రోడ్డు

వికారాబాద్: పై ఫొటోలో కనిపిస్తున్న రోడ్డు నవాబుపేట మండలం చించల్‌పేట్, అతతాపూర్,అక్నాపూర్ గ్రామాల మీదుగా నారేగూడ వరకు వెళ్తుంది. రెండు దశాబ్దాల క్రితం పీఎంజీఎస్‌వై పథకం కింద చించల్‌పేట్ గేటు నుంచి అక్నాపూర్ వరకు ఎనిమిది కిలో మీటర్ల రోడ్డు వేశారు. కాలక్రమేణా ఇది పూర్తిగా దెబ్బతింది. ప్రస్తుతం అడుగడుగునా గుంత కనిపిస్తోంది. రోడ్డును తిరిగి నిర్మించకపోవడంతో ప్రజలు నరకయాతన అనుభవిస్తున్నారు. నాలుగేళ్ల క్రితం ఈ రోడ్డు నిర్మాణానికి రూ.12 కోట్లు మంజూరు చేశారు. అప్పట్లో పనులు ప్రారంభమైనా ఇప్పటి వరకు 50శాతం కూడా పూర్తి కాలేదు. మొత్తం 12 కిలోమీటర్ల రోడ్డు నిర్మించాల్సి ఉండగా అక్నాపూర్ – చించల్‌పేట్ మధ్యలో మూడు కిలోమీటర్లు వేసి చేతులు దులుపుకొన్నారు. ఈ రోడ్డు మీదుగానే ఎమ్మెల్యే యాదయ్య స్వగ్రామానికి వెళుతుంటారు. ఎమ్మెల్యే తిరిగే రోడ్డే ఎలా ఉంటే.. మిగతా వాటి పరిస్థితి ఎలా ఉంటుందో అర్థం చేసుకోవచ్చు.

నిత్యం నరకయాతన

ప్రజలు.. ప్రాంతాల మధ్య కనెక్టివిటీకి రోడ్లు ఎంతో కీలకభూమిక పోషిస్తాయనడంలో అతిశయోక్తి లేదు.. ఈ కనెక్టివిటీ.. ప్రాంతాల అభివృద్ధికి ఎంతో దోహదం చేస్తాయి.. ప్రభుత్వం రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తున్నా పనులపై దృష్టి సారించడంలేదనే విమర్శలు వస్తున్నాయి. అన్ని అనుమతులు, నిధులు ఉన్నా కొన్ని రోడ్లు ఏళ్ల తరబడి పూర్తి కావడంలేదు. దీంతో ప్రజలు ప్రయాణం చేయాలంటేనే జంకుతున్నారు. గుంతకారణంగా తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. ఈ బాధలు భరించలేక ప్రయాణికులు దూరమైన వేరే మార్గాల్లో గమ్యాలకు చేరుకుంటున్నారు. రోడ్లే కాదు వంతెనలు, బ్రిడ్జీల పరిస్థితి కూడా ఇలాగే ఉంది. ప్రభుత్వం, అధికారులపై వాహనదారులు దుమ్మెత్తిపోస్తున్నారు. రోడ్డు పనులు మంజూరైన వెంటనే పాలకులు హడావుడిగా శంకుస్థాపనలు చేస్తున్నారు. కాంట్రాక్టర్లు పనులు ప్రారంభించాక బిల్లులు రాక అవస్థలు పడుతున్నారు. ఏళ్లు గడిచినా నిధులు రాకపోవడంతో పనులను మధ్యలోనే ఆపేసి వెళ్లిపోతున్నారు. ఇలాంటి వాటిని పూర్తి చేసేందుకు ఇతర కాంట్రాక్టర్లు ముందుకు రావడం లేదు. వచ్చినా పనులు దక్కించుకున్న వారు ప్రజాప్రతినిధుల అండదండలతో నిర్మాణాలు జరగకుండా చూస్తున్నారనే విమర్శలు ఉన్నాయి.

నత్తనడకన పనులు

2020 – 21 ఆర్థిక సంవత్సరంలో జిల్లాకు పీఎంజీఎస్‌వై కింద 13 రోడ్లు మంజూరయ్యాయి. 93.9 కిలోమీటర్లు బీటీ రోడ్లు నిర్మించాలని నిర్ణయించారు. ఇందుకోసం రూ.56.85 కోట్లు అవసరం అవుతాయని అంచనా వేశారు. టెండర్లు పిలిచి కాంట్రాక్టర్లకు పనులు అప్పగించారు. నాలుగేళ్లు పూర్తయినా చాలా రోడ్లు పూర్తి కాలేదు. 13 రోడ్లకు గాను ఇటీవల ఎనిమిది పూర్తయ్యాయి. మరో ఐదు నత్తనడకన సాగుతున్నాయి. పనులు జరుగుతున్నాయని అధికారులు చెబుతున్నా అందులో వాస్తవం లేదు. చాలా కాలంగా పనులను ఆపేశారు. ప్రభుత్వం నుంచి సకాలంలో బిల్లులు రాకపోవడం, అంచనా వ్యయం పెరగడంతో కాంట్రాక్టర్లు పనులు చేయడం లేదని తెలిసింది. ఈ విషయమై పంచాయతీరాజ్ ఈఈ ఉమేశ్‌ను వివరణ కోరగా నిధుల కొరత కారణంగా అక్కడక్కడ రోడ్డు నిర్మాణ పనులు నిలిచిపోయాయని తెలిపారు. సాధ్యమైనంత త్వరగా పనులను పూర్తి చేయిస్తామని తెలిపారు.

శ్రీవారికి పవిత్రమాలల సమర్పణ

- ఆగమ శాస్త్రోక్తంగా హోమాలు
- మార్మోగిన గోవింద నామస్మరణ

కొడంగల్: పేదల తిరుపతిగా పేరుగాంచిన కొడంగల్ బాలాజీనగర్‌లో వెలిసిన పద్మావతీ సమేత శ్రీ మహాలక్ష్మీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో పవిత్రోత్సవాలు ఆగమ శాస్త్రోక్తంగా నిర్వహిస్తున్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని శ్రీవారిని దర్శించుకుంటున్నారు. సోమవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు యాగశాలలో వైదిక కార్యక్రమాలు నిర్వహించారు. హోమాలు జరిపించారు. పవిత్ర మాలలను ఊరేగింపుగా తీసుకొచ్చి శ్రీవారి మూలమూర్తికి, ఉత్సవమూర్తులకు, భోగ శ్రీనివాసమూర్తికి, ఉగ్ర శ్రీనివాసమూర్తికి, విష్వక్సేనుల వారికి, విమాన వేంకటేశ్వర స్వామికి, శ్రీ మహాలక్ష్మీ, శ్రీ గోదాదేవి అమ్మవార్లకు సమర్పించారు. ఆలయ ఆవరణలో ఉన్న ఇతర దేవాతామూర్తులకు పవిత్రమాలలు సమర్పించారు. సాయంత్రం ఉభయ నాంచారులతో కలిసి శ్రీవారు మాఢ వీధులలో భక్తులకు దర్శనం ఇచ్చారు. అనంతరం భక్తులకు అన్నప్రసాదం పంపిణీ చేశారు.



ఊరేగింపుగా పవిత్రమాలలు తెస్తున్న అర్చకులు

క్లుప్తంగా

సామాజిక శిక్షణ తరగతులకు తరలిరండి

కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి మల్కయ్య

తాండూరు టౌన్: కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం ఆధ్వర్యంలో ఈనెల 22, 23, 24వ తేదీల్లో సూర్యాపేటలో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి సామాజిక శిక్షణ తరగతులను జయప్రదం చేయాలని కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఉప్పలి మల్కయ్య సోమవారం ఓ ప్రకటనలో కోరారు. కుల వివక్ష, అంటరానితనం, ఎస్సీ, ఎస్టీల హక్కుల సాధన వంటి వాటిపై కేవీపీఎస్ నిరంతర పోరాటం చేస్తోందన్నారు. దేశ సామాజిక, ఆర్థిక, రాజకీయ, భౌగోళిక అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించుటలో భాగంగా ఏర్పాటు చేసిన శిక్షణా తరగతులకు హాజరు కావాలని సూచించారు.

అర్హులకు ఇళ్లు మంజూరు చేయాలి

బీవీహెచ్‌పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నర్సింలు

బంట్వారం: అర్హులైన నిరుపేదలందరికీ రాజకీయాలకు అతీతంగా ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని భారత వికలాంగుల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కావలి నర్సింలు సోమవారం ఓ ప్రకటనలో కోరారు. ప్రభుత్వం ఇటీవల ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేసినప్పటికీ అర్హులైన పేదలకు అన్యాయం జరిగిందన్నారు. గ్రామాల్లో ఇందిరమ్మ కమిటీ సభ్యులు తమకు అనుకూలమైన వారికే ఇళ్లు రాశారని పేర్కొన్నారు. జిల్లా వ్యాప్తంగా ఇదే తంతు కొనసాగిందన్నారు. అధికారులు సైతం రాజకీయ నాయకులకు వత్తాసు పలుకుతున్నారని ఆరోపించారు. నిజమైన అర్హులను గుర్తించి పార్టీలకు అతీతంగా ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలన్నారు. లేకపోతే బీవీహెచ్‌పీఎస్ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా పెద్దఎత్తున ఉద్యమానికి సిద్ధమౌతామని హెచ్చరించారు.

సిలిండర్ నుంచి మంటలు

త్రుటిలో తప్పిన ప్రమాదం



మంటలు చెలరేగిన సిలిండర్

బంట్వారం: వంట చేసే సమయంలో ఒక్కసారిగా సిలిండర్ నుంచి మంటలు రావడంతో ఇంట్లో వారంతా భయాందోళనకు గురయ్యారు. ఈ సంఘటన సోమవారం కోట్‌పల్లి మండలంలోని రాంపూర్ గ్రామంలో చోటు చేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన కె.లవకుమార్ కుటుంబ సభ్యులు ఉదయం వేళ వంట చేస్తుండగా గ్యాస్ లీకై మంటలు చెలరేగడంతో బయటికి పరుగులు తీశారు. అదే సమయంలో అక్కడే ఉన్న ఇంటి యజమాని లవకుమార్ మంటలు ఆర్పేందుకు ప్రయత్నించినా అదుపులోకి రాలేదు. సిలిండర్‌ను పట్టుకొని ఇంటి బయట వేసి బిందెలతో నీరు పోసినా మంటలు చల్లారలేదు. గ్యాస్ అయిపోయేంత వరకు మంటలు చెలరేగి ఆగిపోయాయి. ఈ ఘటనలో ఎలాంటి ప్రమాదం జరుగలేదు.

'కల్లు' తెరిస్తే మేలు!



రేగడిమైలారం ఎస్సీ కాలనీలో కల్లు ప్యాకెట్ తీసుకెళ్తున్న బాలిక

బొంరాస్‌పేట: బాల్యంలోని పిల్లలకు అమ్మానాన్నలు చెప్పే రోజువారీ పనులు ఎంతో ప్రభావం చూపుతాయి. మంచి పనులు వారిలో బాధ్యత పెంచడం, సాయం చేయడం, పెద్దలను గౌరవించడం, తోటి వారితో మెలగాల్సిన జీవిత పాఠాలను నేర్పిస్తాయి. కానీ వ్యసనాల బారిన పడిన కొంతమంది పెద్దలు.. చిన్నారులతో కల్లు, మద్యం, సిగరెట్, బీడీ, పొగాకు వంటివి తెప్పించుకోవడం దుష్ప్రభావాలను కలిగిస్తాయి. పిల్లలకు ఏయే పనులు చెప్పాలో.. ఏ పనులు చెప్పకూడదో.. పెద్దలకే తెలియకపోతే భవిష్యత్తులో ఇబ్బందులు తప్పవని విద్య, మానసికవేత్తలు చెబుతున్నారు.

కారు సీట్లో.. వ్యక్తి మృతి

శంషాబాద్ రూరల్: కారు డ్రైవింగ్ సీటులో కూర్చున్న వ్యక్తి కూర్చున్న చోటే మృతి చెందిన సంఘటన తొండుపల్లిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ కె.నరేందర్‌రెడ్డి కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి.. కర్ణాటకకు చెందిన ఏవీ.గణపతి(60), కోమల దంపతులు తొండుపల్లిలో నివాసముంటున్నారు. ఈ నెల 20న మధ్యాహ్నం గణపతి ఇంటి ముందు కారులో డ్రైవింగ్ సీట్లో కూర్చుని అపస్మారకస్థితిలో చేరుకున్నాడు. దీనిని గుర్తించిన కుటుంబ సభ్యులు అతడిని పరిశీలించగా అప్పటికే మృతి చెందినట్లు గుర్తించారు. డోర్లు వేసుకుని కారులో ఎక్కువ సమయం కూర్చోవడంతో ఊపిరి ఆడక లేదా గుండెపోటుతో మృతి చెందినట్లు భావిస్తున్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఆలూరు మార్గం.. ఆగమాగం

- గుంతలమయంగా మారడంతో ఇబ్బంది పడుతున్న వాహనదారులు
- పట్టించుకునే వారే కరువయ్యారని ప్రజల ఆగ్రహం
- రోడ్ల దుస్థితిని పరిశీలించిన పీడీఎస్‌యూ నాయకులు



ఆలూరు రోడ్డును పరిశీలిస్తున్న పీడీఎస్‌యూ నాయకులు



బురదలో వాహనం కూరుకుపోయి ఇబ్బంది పడుతున్న వాహనదారులు

చేవెళ్ల: ఆలూరు గేట్ నుంచి తంగడపల్లి రోడ్డు మీద ప్రయాణం కత్తి మీద సాములా మారింది. ఈ రోడ్డు అభివృద్ధిని పట్టించుకునే వారు లేక ప్రయాణికులు పట్టపగలే చుక్కలు చూస్తున్నారు. రోడ్డంతా గుంతలమయంగా మారడంతో ఇబ్బందులు పడుతున్నారు. దీనికి తోడు రోడ్డు పక్కన పోసిన మట్టి వర్షానికి బురదగా మారి వాహనాలు దిగబడిపోతున్నాయి.

ప్రకటనలకే పరిమితం

హైదరాబాద్–బీజాపూర్ రహదారిపై ఉన్న ఆలూరు గేట్ నుంచి తంగడపల్లి హైవే వరకు 12 కిలో మీటర్ల దూరం ఉంటుంది. ఈ రోడ్డు మీదుగా ఆలూరు, వెంకన్నగూడ, దుద్దాగు, తలారం, తంగడపల్లి, మడికట్టు, హుసేన్‌పూర్, కొత్తపల్లి, చందిప్ప, ఎన్కేపల్లి, శంకర్‌పల్లి మండలానికి వెళ్లే గ్రామాలు ఉన్నాయి. నిత్యం ఈ మార్గంలో వందల వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. రెండు హైవేలను కలిపే ఈ లింక్ రోడ్డు ఆర్‌అండ్‌బీ పరిధిలోకి వస్తుంది. దీని అభివృద్ధి పనులకు నిధులు మంజూరైనట్లు చెబుతున్నా ఇప్పటి వరకు పనులు ప్రారంభానికి నోచుకోలేదు. ఇప్పటికైనా అధికారులు, నాయకులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

స్థానిక ఎన్నికలను బహిష్కరిద్దాం: శ్రీకాంత్

సోమవారం ఈ మార్గాన్ని పీడీఎస్‌యూ చేవెళ్ల డివిజన్ కార్యదర్శి శ్రీకాంత్, నాయకులు కుమార్, మహేందర్, అశోక్, పవన్ పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఈ రోడ్డు ఇంత అధ్వానంగా మారినా స్థానిక ఎమ్మెల్యేకు, అధికారులకు కనిపించకపోవడం శోచనీయం. ఈ రోడ్లను చూస్తుంటే నియోజకవర్గానికి ఎమ్మెల్యే ఉన్నాడా అనే అనుమానం కలుగుతోందన్నారు. నిత్యం ప్రమాదాల జరుగుతున్నా పట్టించుకోకపోవడం సరికాదన్నారు. ఇప్పటికైనా ఆర్‌అండ్‌బీ అధికారులు మొద్దు నిద్ర వీడాలన్నారు. ఈ మార్గాన్ని త్వరితగతిన బాగు చేయకపోతే స్థానిక ఎన్నికలను బహిష్కరించాలని పిలుపునిచ్చారు.

పోలీసుల అదుపులో దొంగ

- ఆలయంలో చోరీ చేస్తుండగా పట్టుకున్న స్థానికులు
- వెండి వస్తువులు, విగ్రహాలు లభ్యం



పట్టుబడిన వ్యక్తి

ధారూరు: గ్రామ దేవతల ఆలయాల్లో చోరీలకు పాల్పడుతున్న ఓ దొంగను పట్టుకున్న స్థానికులు అతన్ని పోలీసులకు అప్పగించారు. ఈ సంఘటన మండల పరిధిలోని రుద్రారం– తిమ్మానగర్ గ్రామాల మధ్య సోమవారం చోటుచేసుకుంది. రుద్రారంవాసులు, ఎస్‌ఐ రాఘువేందర్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. రుద్రారం శివారులోని బోనమైసమ్మ గుడిలో ఉదయాన్నే ఓ వ్యక్తి ప్రవేశించడాన్ని అక్కడి రైతులు గమనించారు. తాళం వేసి ఉన్న ఆలయంలోకి ఎలా వెళ్లాడనే అనుమానం రావడంతో అక్కడికి చేరుకున్నారు. అప్పటికే తాళం ధ్వంసం చేసిన సదరు వ్యక్తి అమ్మవారి వెండి కళ్లను దొంగిలించాడు. అతన్ని పట్టుకుని ప్రశ్నించగా మరాఠీ, హిందీ మాట్లాడటంతో గ్రామంలోకి తీసుకువెళ్లారు. అతని సంచిలో సోదా చేయగా అమ్మవారి వెండి విగ్రహాలు, కళ్లు, చేతులు, ఓ తాబేలు, బురకపిట్టలు కనిపించాయి. ఈ విషయమై పోలీసులకు సమాచారం ఇవ్వగా ఎస్‌ఐ రాఘువేందర్, సిబ్బందితో వెళ్లి అతన్ని స్టేషన్‌కు తరలించారు. విచారించగా తన పేరు రోహిత్, మహారాష్ట్ర అని మాత్రమే చెప్పాడు. అతని వద్ద వెండి వస్తువులు లభ్యంకావడంతో పూర్తి స్థాయిలో విచారించి, కేసు నమోదు చేసి, రిమాండ్‌కు తరలిస్తామని ఎస్‌ఐ తెలిపారు.

ప్రమాదంలో యువకుడి మృతి

రాజేంద్రనగర్: స్నేహితుడిని ఇంటి వద్ద వదిలి వెళుతుండగా జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓయువకుడు మృతి చెందిన సంఘటన రాజేంద్రనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్సై రాజ్‌కుమార్ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి... మెహిదీపట్నం ము రాత్‌నగర్ చెందిన తరుణ్ కుమార్ (23) ప్రైవేటు ఉద్యోగి. బోనాల పండుగ సందర్భంగా తన ఇంటికి వచ్చిన స్నేహితుడు తరుణ్ కుమార్‌ను ఆదివారం రాత్రి రాజేంద్రనగర్‌లో దిగబెట్టేందుకు వచ్చాడు. తెల్లవారుజామున బైక్‌పై ఇంటికి తిరిగి వెళుతుండగా రాజేంద్రనగర్ పీవీ నర్సింహారావు ఎక్స్‌ప్రెస్‌వే 218 సమీపంలో ముందు వెళుతున్న లారీని వెనుక నుంచి బలంగా ఢీకొట్టాడు. ఈ ఘటనలో తీవ్ర గాయాలు కావడంతో తరుణ్ కుమార్ అక్కడికక్కడే మృతి చెందాడు. రాజేంద్రనగర్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని ఉస్మానియా మార్చురీకి తరలించారు. మృతుడి సెల్‌ఫోన్ ఆధారంగా కుటుంబ సభ్యులకు సమాచారం అందించిన పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

సెలవు రోజున ఇసుక అనుమతులా?



కాగ్నా నది సమీపంలో రోడ్డుపై నిరసన వ్యక్తం చేస్తున్న రైతులు

- రెవెన్యూ అధికారుల తీరుపై మండిపడ్డ రైతులు
- రోడ్డుపై బైఠాయించి నిరసన

యాలాల: కాగ్నా నది నుంచి ఇసుక తరలింపు కోసం రెవెన్యూ అధికారులు జారీ చేసిన అనుమతులపై యాలాల, విశ్వనాథ్‌పూర్ రైతులు మండిపడ్డారు. సోమవారం బోనాల సందర్భంగా సాధారణ సెలవు ఉండగా, పలు ట్రాక్టర్లు, టిప్పర్లు కాగ్నా వద్దకు చేరుకున్నాయి. ఈ విషయం తెలుసుకున్న ఇరు గ్రామాల రైతులు నదిలోకి వెళ్లే ప్రాంతంలో రోడ్డుపై బైఠాయించారు. ప్రభుత్వ పనులు, ఇందిరమ్మ ఇళ్లకు ఇసుక ఇవ్వడాన్ని తాము తప్పు పట్టడం లేదని, సెలవు రోజున పర్మిషన్ ఎలా ఇస్తారని ప్రశ్నించారు. ఇష్టారాజ్యంగా చేపడుతున్న ఇసుక తవ్వకాలతో భూగర్భ జలాలు అడుగంటుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇసుక తరలింపునకు మరో చోట రీచ్ గుర్తించాలని డిమాండ్ చేశారు. ఈ విషయంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే, రైతులతో కలిసి తహశీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మాజీ సభ్యుడు సిద్రాల శ్రీనివాస్, మాజీ సర్పంచ్‌లు బాలేసాబ్, సత్యమ్మ, సొసైటీ డైరెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, రైతులు జీవీరెడ్డి, మాధవరెడ్డి, నాగయ్య, అశోక్, నర్సింహులు, భాస్కరచారి, మలిగేరి నర్సింహులు తదితరులు ఉన్నారు.

అమ్మకు బోనం.. అంతా వైభవం

వికారాబాద్ మున్సిపల్ పరిధిలోని మద్గుల్ చిట్టంపల్లి, రామయ్యగూడ, ఎన్నెపల్లితో పాటు పలు వార్డుల్లో సోమవారం బోనాల పండుగను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి బోనాలు సమర్పించి తమ మొక్కులు తీర్చుకున్నారు. బోనాల ముందు పోతురాజుల విన్యాసాలు, శివసత్తుల పూనకాలు, యువకుల నృత్యాలతో ముందుకు సాగారు.

– అనంతగిరి



అనంతగిరి: రామయ్యగూడలో బోనాల ఊరేగింపు



తాండూరు టౌన్: పోతురాజు వేషధారణలో పాఠశాల విద్యార్థులు



పరిగి: మిట్టకోడూర్ గ్రామంలో బోనాల ఊరేగింపు



అనంతగిరి: ఎన్నెపల్లిలో డప్పుచప్పుళ్లతో సందడి

ఆ బండి.. ఆపండి!

పోయిన స్కూటీ 8 ఏళ్లకు దొరికింది



బంజారాహిల్స్ ట్రాఫిక్ పోలీసులు స్వాధీనం చేసుకున్న స్కూటీ

బంజారాహిల్స్: బంజారాహిల్స్ ట్రాఫిక్ పోలీసులు నిర్వహించిన వాహన తనిఖీల్లో ఎనిమిదేళ్ల క్రితం చోరీకి గురైన ఓ బైక్ పట్టుబడింది. వివరాల్లోకి వెళితే.. ఎల్బీనగర్ సాగర్ రింగ్‌రోడ్డులోని సద్గురు నగర్ కాలనీకి చెందిన పత్రపాటి మహేష్ కుమార్ 2017 సెప్టెంబర్ 7న రాత్రి ఇబ్రహీంపట్నం వందనా విహార్ రెస్టారెంట్‌కు వెళ్లి తన బైక్‌ను హోటల్ ముందు పార్కు చేశాడు. ఉదయం పార్కింగ్ స్థలంలో బైక్ కనిపించకపోవడంతో ఇబ్రహీంపట్నం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు చోరీ కేసు నమోదు చేశారు. ఇదిలా ఉండగా సోమవారం ఉదయం బంజారాహిల్స్ ట్రాఫిక్ క్రేన్ ఎస్‌ఐ సుమన్‌రెడ్డి సిబ్బందితో కలిసి బంజారాహిల్స్ రోడ్డునెంబర్–12లో రోడ్ల పక్కన అక్రమ పార్కింగ్ చేసిన ఓ బైక్‌ను సీజ్ చేసి చలానా విధించి క్రేన్‌లోకి ఎక్కించాడు. కొద్దిసేపట్లోనే అక్కడికి వచ్చిన అబూ అల్తామస్ అనే వ్యక్తి బైక్ తనదేనని చెప్పి జరిమానా చెల్లించాడు. బైక్ తీసుకుని అక్కడి నుంచి వెళ్లిపోతుండగా బంజారాహిల్స్ ఇన్‌స్పెక్టర్‌కు టాస్క్‌ఫోర్స్ పోలీసులు ఫోన్ చేశారు. ఇంతకు ముందు మీరు సీజ్ చేసిన బైక్ చోరీ చేసినదని, వెంటనే ఆపాలని చెప్పారు. దీంతో సదరు వ్యక్తిని ఆపారు. అప్పటికే బైక్ యజమానికి చలానా విధించిన మెసేజ్ వెళ్లింది. ఈ బైక్ తనదేనని, చోరీకి గురైందని, సంబంధిత పత్రాలను అటు ఇబ్రహీంపట్నం పోలీసులు, అటు వాహన యజమాని పోలీసులకు పంపాడు. దీంతో సదరు బైక్‌తో పాటు అబూ అల్తామస్‌ను కూడా ఇబ్రహీంపట్నం పోలీసులకు అప్పగించారు.

మద్యం మత్తులో ఎస్‌ఐతో వాగ్వాదం

సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ అరెస్టు

బంజారాహిల్స్: బోనాల వేడుకలు ముగిసిన అనంతరం ఎక్కడి వారిని అక్కడ పంపిస్తుండగా ఎస్‌ఐని దూషించడమేగాక కానిస్టేబుల్ ఫోన్ ధ్వంసం చేసి న్యూసెన్స్‌కు పాల్పడిన సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌ను బంజారాహిల్స్ పోలీసులు అరెస్టు చేశారు. వివరాల్లోకి వెళితే... బంజారాహిల్స్ రోడ్డునెంబర్–2లోని ఇందిరానగర్ బస్తీలో పోచమ్మ గుడి వద్ద ఆదివారం రాత్రి విధుల్లో ఉన్న సెక్టార్ ఎస్‌ఐ విజయ్, కానిస్టేబుల్ రాజ్‌కుమార్ అక్కడ గుమిగూడిన వారిని ఇళ్లకు పంపించే ప్రయత్నం చేస్తున్నారు. ఆ సమయంలో అదే బస్తీకి చెందిన రాకేష్ అనే సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ స్నేహితుడు అరుణ్‌తో కలిసి ఒకరిపై ఒకరు జోకులు వేసుకుంటూ న్యూసెన్స్ చేస్తున్నారు. దీంతో ఎస్‌ఐ విజయ్ వారిని ఇళ్లకు వెళ్లిపోవాలని చెప్పాడు. మద్యం మత్తులో ఉన్న రాకేష్ తాము ఇక్కడ ఉంటే మీకు ఏమంటూ దురుసుగా ప్రవర్తించాడు. అసభ్యకరంగా ప్రవర్తిస్తూ న్యూసెన్స్ చేయడమేగాక అక్కడే బైఠాయించాడు. అతడిని పైకి లేపడానికి యత్నిస్తున్న ఎస్‌ఐ, కానిస్టేబుళ్లపై దురుసుగా ప్రవర్తించడంతో కానిస్టేబుల్ రాజ్‌కుమార్ ఫోన్ కిందపడి ధ్వంసమైంది. దీంతో పోలీసులు రాకేష్‌పై కేసు నమోదు చేసి అరెస్టు చేశారు. బంజారాహిల్స్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఆగి ఉన్న లారీని ఢీకొట్టిన బైక్

- యువకుడి దుర్మరణం

ఆమనగల్లు: ఆగి ఉన్న లారీని బైక్ ఢీకొట్టిన ఘటనలో ద్విచక్రవాహనదారుడు మృతి చెందగా మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటన సోమవారం మధ్యాహ్నం మున్సిపల్ పరిధిలోని విఠాయిపల్లి వద్ద శ్రీశైలం–హైదరాబాద్ జాతీయ రహదారిపై చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం.. తలకొండపల్లి మండలం గట్టుఇప్పలపల్లి గ్రామానికి చెందిన ఏదుల అశోక్(27), ఏదుల వెంకటయ్య ఇరువురూ బైక్‌పై విఠాయిపల్లి వెళ్తున్నారు. గ్రామ సమీపంలో జాతీయ రహదారిపై నిలిపి ఉన్న లారీని వెనుక నుంచి ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో తీవ్రగాయాలైన అశోక్ ఘటనా స్థలిలోనే మృతి చెందగా, వెంకటయ్యకు తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని ప్రమాద వివరాలు సేకరించారు. క్షతగాత్రుడికిని చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. అశోక్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే మృతదేహానికి నివాళి అర్పించారు.

భూ వివాదంలో 'విల్లా స్ప్రింగ్స్'కు ఎదురుదెబ్బ

ట్రయల్‌కోర్టు తీర్పులో జోక్యానికి హైకోర్టు నిరాకరణ

సాక్షి, హైదరాబాద్: మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా, అల్వాల్ మండలం, కొంపల్లిలోని భూ వివాదంలో విల్లా స్ప్రింగ్స్ హౌస్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్‌కు హైకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. 2023, అక్టోబర్ 19న ట్రయల్‌కోర్టు ఇచ్చిన తీర్పులో జోక్యం చేసుకునేందుకు నిరాకరించింది. విల్లా స్ప్రింగ్స్ దాఖలు చేసిన సివిల్ రివిజన్ పిటిషన్‌ను కొట్టివేసింది. కొంపల్లిలో అసోసియేషన్‌లో 110 విల్లాలున్నాయి. వీటికి ఆనుకుని రెండెకరాల ఐదు గుంటల భూమిలో అసోసియేషన్‌కు 8 గుంటల భూమి వాడుకునేందుకు అనుమతి ఉందని, దీనికి సంబంధించి తమ వద్ద ఎంఓయూ ఉందంటూ నిక్సన్‌నాథన్ అనే వ్యక్తితోపాటు మరికొందరు ఆ స్థలాలను ఆట స్థలాలుగా మార్చారు. అయితే సదరు రెండెకరాల ఐదు గుంటల భూమిని తాను కొనుగోలు చేశానని, అప్పటి నుంచి నిక్సన్ అండ్ కో తనను వేధించడమే కాకుండా దౌర్జన్యానికి దిగారని అదే అసోసియేషన్ నివాసి మౌనికదేవి వాదన. ఈ వివాదం కోర్టుకు చేరింది. విచారణ చేపట్టి వాదనలు విన్న ట్రయల్‌కోర్టు ఆ భూమిపై మౌనికకు అనుకూలంగా ఇంజక్షన్ ఉత్తర్వులు ఇచ్చింది. దీనిని సవాల్ చేస్తూ విల్లా స్ప్రింగ్స్ హైకోర్టులో అప్పీల్ చేసింది. దీనిపై జస్టిస్ తడకమళ్ల వినోద్‌కుమార్ విచారణ చేపట్టి తాజాగా తీర్పు నిచ్చారు. ట్రయల్‌కోర్టు అన్ని అంశాలను పరిశీలించిన తర్వాతే తుది ఉత్తర్వులు జారీ చేశాసిందని, పొరుగు భూమిపై తమకు హక్కు ఉందంటూ అనవసర రాద్ధాంతం చేస్తున్న విల్లా స్ప్రింగ్స్‌కు ఎలాంటి హక్కులు లేవని తేల్చిచెప్పారు. 17 ఏళ్ల నుంచి ఆ భూమిని వాడుకుంటున్నామన్న నిక్సన్ వాదనలో నిజం లేదన్నారు. ఎంఓయూ రాసుకున్నదే 2015లో అని.. అదీ రిజిస్టర్ చేయలేదన్నారు. అందులోనూ భూ యజమానులు అమ్ముకునే వరకు 3 గుంటలే వాడుకునేందుకు ఒప్పందం ఉందని, 8 గుంటలు అని చెప్పడం అవాస్తమని చెప్పారు. మౌనికాదేవికి అమ్మడానికి ముందే ఆ అనధికారిక ఎంఓయూను కూడా రద్దు చేశారంటూ.. విల్లా స్ప్రింగ్స్ దాఖలు చేసిన పిటిషన్‌ను కొట్టివేశారు.

యువకుడి దారుణ హత్య

విజయనగర్‌కాలనీ: ఓ యువకుడు హత్యకు గురైన సంఘటన ఆసిఫ్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ ఆనంద్ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి.. సాబేర్‌నగర్‌కు చెందిన మహ్మద్ ఖబులా అలియాస్ అడ్డుఖాన్ (28) సోఫా మేకర్‌గా పని చేసేవాడు. ఆదివారం రాత్రి అతను స్థానిక ఆసిఫ్‌నగర్ జిర్రా రహత్‌హోటల్ సమీపంలోని కిషన్‌నగర్ సందులో తన స్నేహితుడు షేక్ ఖబులాతో కలిసి మద్యం సేవిస్తుండగా గుర్తుతెలియని యువకులు అతడిపై కత్తితో దాడి చేశారు. ఈ ఘటనలో ఖబులా కిందపడిపోవడంతో బండరాళ్లతో తలపై మోది దారుణంగా హత్య చేసి అక్కడి నుంచి పరారయ్యారు. సమాచారం అందుకున్న ఆసిఫ్‌నగర్ పోలీస్ డివిజన్ ఏసీపీ కిషన్‌కుమార్ సంఘటనా స్థలాన్ని పరిశీలించారు.

ముష్కి చెరువు పరిరక్షణకు ఉద్యమిస్తాం



చెరువును పరిశీలిస్తున్న నివాసితులు

మణికొండ: నార్సింగి, మణికొండ మున్సిపాలిటీల మధ్యలో ఉన్న ముష్కి చెరువును పరిరక్షణకు అవసరం అయితే ఉద్యమిస్తామని మైహోం అవతార్, హాల్‌మార్క్ వినిసియా నివాసితులు పేర్కొన్నారు. సోమవారం చెరువు వద్ద వారు సమావేశమయ్యారు. చెరువు వద్ద నిబంధనలకు విరుద్ధంగా ధృవాన్ష్ సంస్థ చేపడుతున్న పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... తమ అభ్యంతరాలను ఇప్పటికే హైడ్రా, హెచ్‌ఎండీఏ, ఇరిగేషన్, మున్సిపల్ అధికారుల దృష్టికి తీసుకెళ్లామన్నారు. తమ చర్యలను ఆయా శాఖల అధికారులు సైతం అభినందించి దిద్దుబాటు చర్యలు చేపడతామని, హెచ్‌ఎండీఏతో తత్వా రియల్ ఎస్టేట్ సంస్థకు జరిగిన ఒప్పందాల ప్రకారమే పనులను చేపడతామని హామీ ఇచ్చారని తెలిపారు. వాటిని నిలుపుకొనేందుకు మరో వారం రోజుల పాటు సమయం ఇస్తామని, అయినా నిబంధనలకు విరుద్ధంగా పనులను చేపడితే ప్రజా ఆందోళనను చేపడతామన్నారు. కార్యక్రమంలో నివాసితుల సంఘం ప్రతినిధి గౌతంరెడ్డి, నివాసితులు పాల్గొన్నారు.

రైలు నుంచి జారిపడి..

గుర్తు తెలియని వ్యక్తి దుర్మరణం



నందిగామ: రైలు నుంచి జారిపడి ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన మండల పరిధిలోని హెచ్‌బీఎల్ పరిశ్రమ సమీపంలో సోమవారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. రైల్వే కానిస్టేబుల్ మల్లేశ్ తెలిపిన ప్రకారం.. హెచ్‌బీఎల్ పరిశ్రమ సమీపంలో ఆదివారం అర్ధరాత్రి దాటిన తర్వాత గుర్తుతెలియని రైలు నుంచి కిందపడి గుర్తుతెలియని వ్యక్తి(35) రైలు పట్టాలపై మృతి చెంది ఉన్నాడు. సోమవారం ఉదయం స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు సంఘటన స్థలానికి చేరుకుని మృత దేహాన్ని పరిశీలించామన్నారు. మృతుడి ఎడమ చేతిపైన ఆంటోనియా అని పచ్చబొట్టు ఉందని, కుడిచేతికి బ్లాక్ కలర్ రబ్బర్ బ్యాండేజీ ఉందని చెప్పారు. మృతుడికి ఉంగరాల జుట్టు ఉందని, బూడిద రంగు ప్యాంటు, బ్లాక్ డ్రాయర్ ధరించి ఉన్నాడని, మృతుడి ఒడిశా లేదా బీహార్ రాష్ట్రాలకు చెందిన వ్యక్తిగా అనుమానం వ్యక్తం చేశారు. తిమ్మాపూర్ స్టేషన్ మాస్టర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని, మృతదేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం షాద్‌నగర్ కమ్యూనిటీ ఆస్పత్రికి తరలించామని చెప్పారు. వివరాలకు 98480 90426 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

పిచ్చి మొక్కల తొలగింపు

సాక్షి ఎఫెక్ట్..

దుద్యాల్: మండల పరిధిలోని హకీంపేట్ గ్రామంలో విద్యుత్ సరఫరా అందించే ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ పిచ్చి మొక్కలు నిండిపోయి ప్రమాదకరంగా మారింది. 'అల్లుకున్న ప్రమాదం'అనే శీర్షికతో ఇటీవల సాక్షిలో ప్రచురితమైన వార్తకు అధికారులు స్పందించారు. సోమవారం ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ ప్రమాదకరంగా ఉన్న పిచ్చి మొక్కలు, ముళ్ల పొదలను తొలగించారు. దీంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.



ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ పిచ్చి మొక్కలు తొలగించిన విద్యుత్ అధికారులు